కథ

# సిరి

**వాణిశ్రీ**

కోట్లు వచ్చిపడేటప్పటికి వుక్కిరిబిక్కిరైపోయాడు గురవయ్య. ముప్ఫై ఏళ్ళపాటు ఎల్డీసీగా, యుడీసీగా, సెక్షన్ ఆఫీసరుగా జీవితమంతా అరగదీసినా పట్టుమని పదివేలు కావాల్సొస్తే ముష్టెత్తుకోవాల్సిందే! అటెండర్ బుద్ధయ్య దగ్గర వడ్డీకి పరిగెత్తాల్సిందే. పేరుకి ఇరవైవేలు జీతమైనా ఇంటి లోను, స్కూటర్ లోను, టీవీ లోను, మంచాలు కంచాలు అన్నీ లోనుతోనే కొనడంతో మూడొంతుల జీతం క్షవరమైపోతోంది. మిగిలిన దాంతో కనాకష్టంగా నెట్టుకొస్తున్నాడు.

స్వగ్రామంలో బంధుమిత్రుల నుంచి వచ్చే పెళ్ళి శుభలేఖలు, దినం కార్డులు చూసినప్పుడల్లా అంత దూరం పోవడానికి, రావడానికి ఎంత ఖర్చు అవుతుందో లెక్కలేసుకుని బావురుమనేవాడు. సెలవు దొరకలేదనో, ఆఫీసులో తను లేకపోతే బిల్డింగ్ కూలిపోతుందనో, ఇనస్పెక్షన్‌కి శ్రీకాకుళమో, కుప్పమో వెళ్తున్నాననో ఒక కార్డు ముక్క రాసి పడేసేవాడు.

అంత నిస్సారమైన జీవితం గడుపుతున్న గురవయ్యకి పాతికేళ్ళ క్రితం గజం రూపాయి పావలాకి కొన్న భూమి విలువ అమాంతం విశ్వరూపం దాల్చి కోట్లకు పడగలెత్తడంతో శని వదిలిపోయి శుక్రమహర్దశ ప్రారంభమైనట్లయింది.

అదే సమయంలో కొడుకు ముక్కుతూ మూలుగుతూ బిటెక్ పూర్తిచేయడంతో గురవయ్య సంతోషానికి అంతులేదు.

యన్జీవో కాలనీలో డొక్కు యల్జైజీ ఇంటిని కారుచౌకగా అమ్మేశాడు. ఇంకా నాలుగేళ్ళు సర్వీసు మిగిలి వున్నా, ఆ దరిద్రపు యస్.ఓ వుద్యోగం, చీటికిమాటికి సెక్రటరీలు పిల్చి పెట్టే చీవాట్లు, వాయింపులు ఇంకానా ఇకపై సాగనివ్వనని స్వచ్ఛంద పదవీ విరమణ చేసేసి దర్జాగా కారులో షికారు తిరగసాగాడు.

హైటెక్ సిటీలో ఇండిపెండెంట్ బిల్డింగ్ కట్టించి పాత కొలీగ్స్, సిటీలో ఆ మూల ఈ మూల వున్న బంధువులు ఈర్ష్య, అసూయలతో కుమిలిపోతూండగా వైభవంగా గృహప్రవేశం చేశాడు.

గురవయ్య భార్య అనసూయ తనిష్క్ గోల్డ్ కిలోలకొద్దీ ఎగ్జిబిషన్ పెట్టేసి, వాటి ధరలు, నాణ్యతా వివరిస్తూ అందరి ముఖాలూ బొగ్గుల్లా మాడ్చుకునేట్లు చేసింది.

తన స్వగ్రామం తాళ్ళ సింగారంలో తాటిపాకలో దరిద్రం అనుభవించిన చోటునుంచి చుట్టాలెవరూ రాకపోవడం ఎంతో వెలితిగా అనిపించింది గురవయ్యకి.

'మన గురవయ్యే! ఇప్పుడు హైదరాబాద్‌లో కోటీశ్వరుడయ్యాడు. మూడంతస్తుల మేడ కట్టించాడు. పడవంత కారులో తిరుగుతున్నాడు. గురవయ్య పెళ్ళాం అనసూయ వంటినిండా బంగారమే' అని వూరి జనాలు చెప్పుకోవాలనే కోరిక తీరకుండా పోయింది.

తన అసంతృప్తి అనసూయతో చెప్పుకున్నాడు.

"దాందేవుంది లెండి. మన మనోహర్ పెళ్ళికి స్పెషల్ బస్సొకటి మీ వూరు నుంచి వేద్దాం. అందులో మన చుట్టాలందర్నీ హైదరాబాద్ తీసుకొద్దాం. మీ కోరిక తీరుతుంది" అన్నది అనసూయ.

"వీడెప్పుడు పెళ్ళి చేసుకోవాలి? పెళ్ళంటేనే మండిపడుతున్నాడుగా? ఏంటో వీడి సంగతి అర్థం కాకుండా వుంది. అందరి పిల్లలూ అమెరికా, అమెరికా అని ఎగిరిపోతుంటే వీడు నంగిలా ఎప్పుడూ పుస్తకాల పురుగులా చదువుకుంటుంటాడు. వాడి గదినిండా గోడల్లా పుస్తకాలు పేర్చుతుంటాడు. దానికి తోడు బొమ్మలు గియ్యడం ఒకటి. పిచ్చి పిచ్చి బొమ్మలు, ఆ రంగుల గీతలు..వీడసలు బాగుపడతాడంటావా?" వాపోయాడు గురవయ్య.

"ఎవరి పిచ్చి వారికానందం. ఇప్పుడు వాడు అమెరికా వెళ్ళి డబ్బు సంపాదించాలా? దేవుడి దయవల్ల మనకి కోట్లు వచ్చాయి. చాలదూ? ఆశకు అంతుండాలి" అన్నది అనసూయ.

"ఓసి పిచ్చి మొఖమా? సొసైటీలో స్టేటస్ వుండాలి. ఎవర్ని కదిలించినా మా అబ్బాయి అమెరికాలో వున్నాడనో, ఆస్ట్రేలియాలో జాబ్ చేస్తున్నాడనో గర్వంగా చెప్తుంటే నాకెంత సిగ్గుగా వుందో తెలుసా? ముక్కుతూ మూలుగుతూ ఎట్లాగో బి.టెక్ చేశాడు. బాగానే వుంది. అమెరికా వెళ్ళిపోయి జాబ్ చేస్తుంటే మనకెంత ప్రెస్టేజీగా వుంటుంది. మీ వాడేం చేస్తున్నాడంటే చెప్పలేక సిగ్గుపడుతున్నాను. ఏం చెప్పాలి? పనికిమాలిన కవిత్వం రాస్తున్నాడని చెప్పనా? రంగు రంగుల బొమ్మలేసి గోడలనిండా తగిలిస్తున్నాడని చెప్పనా?" గురవయ్య కొడుకు నిర్వాకం మూలంగా తెగ ఫీలైపోయాడు.

"ఎందుకింత ఇదైపోతున్నారు? వున్న ఒక్కగానొక్క కొడుకు కళ్ళముందు వున్నాడని సంతోషించక" అన్నది అనసూయ.

గురవయ్య భార్యవైపు గుర్రుగా చూశాడు.

"మీరేం వర్రీ కాకండి. పెళ్ళి చేస్తే దారికి వస్తాడు. కొన్నాళ్ళు వాడిష్టం వచ్చినట్లు వుండనియ్యండి. స్నేహితులతో తిరుగుతూ చెడు అలవాట్లు చేసుకుంటే బాధపడాలి గానీ బుద్ధిగా పుస్తకాలు చదువుకుంటూనో, బొమ్మలేసుకుంటూనో వుంటున్న బాబు గురించి దిగులు పడతారెందుకు? ఏమో వాడు ముందు ముందు సినారేలా సిన్మాపాటలు రాస్తాడేమో, ఎమ్ఎఫ్ హుస్సేన్‌లా బొమ్మలేసి కోట్లు సంపాదిస్తాడేమో?" కొడుకుని వెనకేసుకొచ్చింది అనసూయ.

"ఆ...సంపాదిస్తాడు కోట్లు? ఉన్న డబ్బంతా పుస్తకాలు కొనడానికి, రంగులెయ్యడానికి తగలెయ్యకుండా వుంటే చాలు" అని విసుక్కున్నాడు గురవయ్య.

మనోహర్ మాత్రం రవీంద్రభారతిలో కవుల మీటింగులకీ, త్యాగరాయగాన సభలో పుస్తకావిష్కరణలకీ, ఆర్ట్‌గ్యాలరీలలో చిత్రకళా ప్రదర్శనకు తిరుగుతూ 'కళాపైత్యం' (గురవయ్య మాటల్లో) ఎక్కించుకుని తిరుగుతున్నాడు.

గురవయ్య- మనోహర్ పెళ్ళి చెయ్యాలని సంబంధాలు చూస్తున్నాడు. కొన్ని సంబంధాలు ఏభై లక్షలు, డెబ్భై లక్షలు ఇచ్చేవి వున్నాయని మేరేజి బ్యూరోవాళ్ళు ఫోన్లు చేస్తుంటే విసుక్కున్నాడు.

"రెండు కోట్లు కట్నం ఇచ్చే సంబంధాలుంటే ఫోన్ చెయ్యమని" చెప్పేశాడు.

"కట్నం కోసం చూసుకుంటే ఎలాగండీ? అమ్మాయి అందంగా, చదువుకున్నదై, మంచి కుటుంబం నుంచీ రావాలి గాని.." అని ఒక వైపు అనసూయ మొత్తుకుంటోంది.

"నీ మొఖం అందం అంటే డబ్బే. రెండు కోట్లు కట్నం ఇచ్చే స్తోమత వున్న వాళ్ళది మంచి కుటుంబం కాదా? అంత డబ్బున్న వాళ్ళు అమ్మాయిని చదివించకుండా వుంటారా? నీకేం తెలిసి చావదు" అని విసుక్కున్నాడు గురవయ్య.

శ్యామలరావని, గురవయ్యతో ఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నోడే, తాళ్ళ సింగారం నుంచి శుభలేఖ పంపించాడు. అతగాడి కూతురు పెళ్ళట. తప్పకుండా రమ్మని నోట్ రాశాడు.

ఇకనేం తన వైభవం చూపించడానికి భార్య, కొడుకుతో సహా పడవలాంటి కారులో తాళ్ళసింగారం బయల్దేరాడు గురవయ్య.

* * *

కొత్తగా కోటీశ్వరుడైన గురవయ్యకి తాళ్ళసింగారంలో చిన్ననాటి స్నేహితుడు శ్యామలరావు ఘనస్వాగతం పలికి, విడిదికి మామిడితోటలో పెంకుల బంగళా ఏర్పాటు చేశాడు.

గురవయ్య గృహప్రవేశం సి.డీలు, ఫోటో ఆల్బమ్ తీసుకెళ్ళడం మర్చిపోలేదు. ఆ వూళ్ళో వున్న చుట్టాల ఇళ్ళన్నీ తిరుగుతూ సి.డీలో వున్న గృహప్రవేశం దృశ్యాలు చూపిస్తూ, తన మూడంతస్తుల భవనం వైభవం వివరిస్తూ కాలం గడుపుతుంటే, అతగాడి భార్య అనసూయ తన నగలు ప్రదర్శిస్తూ, ఆ వూరి వాళ్ళు వాటి ధరలు విని నోళ్ళు తెరుస్తుంటే చూసి ఆనందిస్తోంది.

మనోహర్‌కి మాత్రం తాళ్ళసింగారం తెగ నచ్చేసింది. చుట్టూ ఏనుగుమందల్లా కొండలు, పచ్చటి వరిచేలు తివాచీల్లా నేలంతా పరుచుకున్నట్లు కనిపిస్తుంటే మైమరచిపోయాడు. నీలాకాశంలో బారులు తీరిన

కొంగలు, వేణుగోపాలస్వామి దేవాలయం కోనేటిలో జలకాలాడుతూ నోళ్ళు తెరుచుకుని మనుషుల్ని చూసే చేపలు, అందులో తేలుతున్న తామరపూలు చూసి అబ్బురపడిపోయాడు.

పెద్ద చెరువు గట్టున మర్రిచెట్టు క్రింద నిల్చుని దూరంగా కనిపిస్తున్న వేణుగోపాలస్వామి గుడి గాలిగోపురం, నల్లటి కొండలు, పచ్చటి చేలు కేన్వాస్‌లో చిత్రించాలని ఈజిల్ ముందు నిల్చున్నాడు మనోహర్.

సాయంకాలం సూర్యుడు కొండల్లోకి మునిగిపోవడానికి సిద్ధమైపోతున్నాడు.

కిలకిలా నవ్వులు, మెత్తటి పాదాల అడుగుల చప్పుడు విని తలతిప్పి చూసే లోపల నలుగురు అందగత్తెలు చెరువులోకి దూకి ఈత కొడుతూ ఆడుకోసాగారు. దివి నుండి భువికి దిగిన అప్సరసల్లా మనోహరంగా కనిపిస్తున్నారు మనోహర్‌కి. తను వెయ్యాలనుకున్న చిత్రం గురించి మర్చిపోయి వాళ్ళవైపే మైమరచిపోయి చూస్తూ రస తన్మయత్వంలో మునిగిపోయాడు.

అందులో సంపంగి పువ్వులాంటి అమ్మాయి, కోటేరు ముక్కుతో, విశాల నేత్రాలతో మిలమిల జలకన్యలా మెరిసిపోతూ మనోహర్‌ని ఆకట్టుకుంది.

కాసేపు జలక్రీడలాడిన అమ్మాయిలు తడి దుస్తులతో ఒడ్డుకొచ్చి నిల్చొని, ఓణీలు తీసి నీళ్ళు పిండుతుంటే మనోహర్‌కి చూడ్డానికి రెండు కళ్ళూ చాలవనిపించింది.

సిటీలో జీన్స్‌ప్యాంట్లు, టీ షర్టులు, చుడీదార్లతో తిరిగే అమ్మాయిల్ని చూసీ చూసీ విసుగెత్తిన మనోహర్ కళ్ళకి పల్లెటూరి లంగా, జాకెట్, ఓణీలు వేసుకున్న అమ్మాయిల అందం చూసి అబ్బురపడిపోయాడు. ఎంత అందంగా, కళకళలాడుతున్న ముఖాలతో, పుష్టిగా, ఆరోగ్యంగా వున్నారోనని ఆశ్చర్యపోయాడు.


తమని ఎవరో అపరిచిత యువకుడు చెరువు గట్టున నిల్చుని చూస్తున్నాడని గమనించిన అమ్మాయిలు బెదిరిపోయారు. ఓణీలు గబగబా పిండుకుని పైటలు సర్దుకున్నారు.

విశాల నేత్రాల మీనాక్షి, కోటేరు ముక్కు చిన్నది పసిడి రంగులో మెరిసిపోతున్న యువతి, ఆకుపచ్చ లంగా, ఓణీలో వనకన్యలా వున్న కన్యామణి కోపంగా చూస్తూ మనోహర్ దగ్గరికి వచ్చింది.

మనోహర్ కళ్ళార్పకుండా ఆమెనే తన్మయుడైపోయి చూస్తున్నాడు.

"ఏయ్! ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావ్?" అని దబాయించింది.

మనోహర్ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. తడిదుస్తుల్లో ఆమె అందాలను తనివి తీరా చూస్తున్నాడు.



"మాట్లాడవేం?" అని రెట్టించింది.

"కన్పించడంలా?" అన్నాడు.

ఆమె ఈజిల్ వైపు, అతని చేతిలోని బ్రష్‌వైపు చూసి "ఓహో..బొమ్మలేస్తున్నావా? ఏదీ ఏం కనిపించడం లేదే?" అన్నది కొంటెగా.

"కొంచెంసేపు అట్లాగే నిల్చో! నీ బొమ్మ వేస్తాను" అన్నాడు.

"ఆ! నా బొమ్మ వేస్తావా? ఏం తిక్క తిక్కగా వుందా?" అన్నది కోపం అభినయిస్తూ.

"చంద్రా! అతనితో ఎందుకు లేవే! పోదాం పద. ఎవరో పెళ్ళికి వచ్చినట్లున్నాడు" అన్నది ఒకమ్మాయి.

"ఔను. నిజమే హైదరాబాద్ నుంచి వచ్చాను. నేను గురవయ్యగారబ్బాయిని" అన్నాడు.

"గురవయ్యా! గవరయ్యా.." అని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు అమ్మాయిలు.

'చంద్రా! చందమామలా వుంది' అని గొణుక్కున్నాడు మనోహర్.

అతని మూడ్ మారిపోయింది. మనసంతా చంద్ర సౌందర్యంతో నిండిపోయింది. ఇంతవరకూ ఏ అమ్మాయిని చూసినా కలగని హృదయ స్పందన చంద్రని చూడగానే ఎందుకు కలిగిందో ఆలోచిస్తూ ఈజిల్‌స్టాండ్ మడిచి విడిదింటి దారి పట్టాడు మనోహర్.

ఆ రాత్రి శ్యామలరావు కూతురు పెళ్ళి.

ఇంటిముందు పచ్చటి తాటాకుల పందిరి. పందిరి నిలిపిన ప్రతి స్థంభానికీ ఒక అరటిచెట్టు కట్టాడు. పందిరిచుట్టూ మామిడాకుల తోరణాలు. ఉల్లిపొరకాగితాలు, చెమ్కీ దండలతో అలంకరణలు, మైక్‌లో నుంచి విపిస్తున్న మంగళవాయిద్యాలు. అవన్నీ చూస్తున్న మనోహర్ మనసు సరికొత్త ప్రపంచాన్ని ఆస్వాదిస్తోంది. పెళ్ళంటే ఇంత సందడిగావుండాలి అనుకున్నాడు పందిట్లో ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ.

సిటీలో వుంది? రెడీమేడ్ మేరేజీ హాలు. చెవులు చిల్లులు పడే బేండ్ మేళాలు. అక్కడ పలకరించే దిక్కు లేదు. స్టేజీ మీద పెళ్ళితంతు జరుగుతూవుంటుంది. వీడియో తీసేవాళ్ళు, ఫోటోగ్రాఫర్లు మూగుతారు. ఏమీ కనిపించదు. ఆకలేస్తే బిచ్చగాళ్ళ మాదిరిగా పళ్ళెం పట్టుకెళ్ళి వడ్డించే వాళ్ళముందు క్యూలో నిలబడడం. అంతా రొటీన్.

"భోజనానికి పదండి. ముహూర్తానికి చాలా

టైముంది" ఆప్యాయంగా ఎదురొచ్చాడు శ్యామలరావు.

విస్తరాకుల్లో బంతి భోజనం వడ్డిస్తుంటే హాయిగా వుంది. పూర్ణం బూరెలు, పులిహోర, సేమ్యా పాయసం, బొబ్బట్లు, గోంగూరపచ్చడి, నాలుగు రకాల కూరలు, గడ్డ పెరుగు. ఎంత కమ్మటి భోజనం!

సిటీలో కేటరింగ్ వాళ్ళు పెట్టే మసాలా ఫ్రైడ్ రైస్ కంటే ఎన్నో రెట్లు రుచిగా వుంది చింతపండు పులిహోర.

మనోహర్‌కి భుక్తాయాసంగా వుంది.

పెళ్ళిముహూర్తం రాత్రి పదకొండు గంటలకి. ఇంకా ఎనిమిదిన్నరే.

మనోహర్ శ్యామలారావు ఇల్లంతా కలయదిరిగాడు. చుట్టాలతో సందడిగా వుంది.

ఎవరూ లేని గదిలో పడక కుర్చీ కనిపించింది. ఫ్యాన్ వేసుకుని అందులో కూర్చున్నాడు. మనోహర్‌కి నిద్రపట్టింది. భుక్తాయాసం వల్లనో ఏమో నిద్ర ఆపుకోలేకపోయాడు.

గాజుల గలగలలు, మువ్వల చప్పుళ్ళు, కొత్తచీరలు విప్పుతున్న శబ్దం కిలకిల నవ్వులు వినిపిస్తుంటే మెలకువ వచ్చింది.

పడక కుర్చీలో నుంచి లేచి అటువైపు తిరిగాడు.

అక్కడ చంద్ర. ఎవరో ఆమెకు పట్టుచీర కడుతున్నారు. సడన్‌గా లేచి నిల్చున్న మనోహర్‌ని చూసి చంద్ర కెవ్వున కేకపెట్టింది. అటువైపు తిరిగి కూర్చున్నందువల్ల అతను ఎవరికీ కన్పించి వుండడు.

రెండు చేతులూ జాకెట్‌కి అడ్డంగా పెట్టుకుని "ఏయ్! ఇక్కడెందుకున్నావ్?" అని అరిచింది చంద్ర.

మనోహర్ ముసి ముసి నవ్వులు విసురుకుంటూ క్రీగంట చంద్రను చూస్తూ గదిలోనుంచి నిష్క్రమించాడు.

ఇక పెళ్ళిలో చంద్ర పెళ్ళికూతురు పక్కనే కూర్చుంది. అక్కడ్నుంచే మనోహర్‌ని చూస్తోంది. అప్పుడప్పుడూ చూపులు ఢీకొంటుంటే సిగ్గుతో తల వంచుకుంటోంది. మనోహర్ పెళ్ళి తంతు చూడ్డం లేదు. చూపులన్నీ చంద్ర మీదే.

★ ★ ★

తాళ్ళ సింగారంలో చుట్టాలకి, స్నేహితులకు తన వైభవమంతా చూపించిన తృప్తితో సిటీకి బయల్దేరాడు గురవయ్య.

"మా వాడి పెళ్ళికి అంతా తప్పకుండా రావాలి. బస్ అరేంజ్ చేస్తాను" కనిపించిన వారికంతా చెప్తున్నాడు గురవయ్య.

గురవయ్య, అనసూయ కారెక్కి కూర్చున్నారు. శ్యామలరావు ఫ్యామిలీ కారు దగ్గరికి వచ్చి వీడ్కోలు పలుకుతున్నారు.

"అబ్బాయి ఏడి?" అన్నది అనసూయ.

"ఔను వాడేడి?" అంటూ కారు దిగాడు గురవయ్య.

"అబ్బాయిగారు విడిదింట్లో వున్నారండి" చెప్పాడు డ్రైవర్.

"బయల్దేరుతున్నాం రమ్మను" అన్నాడు గురవయ్య.

"అబ్బాయిగారు బొమ్మలేసుకుంటున్నారండి"

డ్రైవర్ చెప్పిన మాటలకు మండింది గురవయ్యకి.

"బొమ్మలేసుకోవడానికి వేళాపాళా లేదా వెధవకి" అని భార్యవైపు సీరియస్‌గా చూశాడు.

అనసూయ కారు దిగి విడిదింట్లోకి వెళ్ళింది.

అక్కడ చంద్ర బొమ్మ వేస్తున్నాడు మనోహర్. అతని ముఖం కళకళలాడిపోతోంది. కొడుకు ముఖంలో పెళ్ళికళ చూసి ఆశ్చర్యపోయింది అనసూయ. డిస్టర్బ్ చేయాలనిపించక చూస్తుండిపోయింది.

అనసూయ ఎంతకీ రాకపోయేసరికి రంకెలేసుకుంటూ, బుసలు కొడుతూ వచ్చాడు గురవయ్య. అతని వెనుకే శ్యామలరావు ఫ్యామిలీ కూడా వచ్చారు.

ఈజిల్ ముందు నిల్చుని పెయింట్ చేస్తున్న కొడుకునీ, మురిసిపోతూ చూస్తున్న భార్యని చూసి గురవయ్య కోపం నషాళానికంటింది.

"బొమ్మలేసుకుంటూ ఇక్కడే వుండిపోతావా ఏంరా?" అన్నాడు గురవయ్య.

మనోహర్ రెస్పాన్స్ ఇవ్వలేదు.

"అబ్బాయి ఈ అమ్మాయినే చేసుకుంటాడటండీ" అన్నది అనసూయ.

నెత్తిన బాంబ్ పేలినట్లు అదిరిపడిన గురవయ్య "ఏ అమ్మాయే?" అన్నాడు.

"ఈ బొమ్మ మా చంద్రదే!" అన్నాడు శ్యామలరావు ఆశ్చర్యపోతూ.

"చంద్ర ఎవర్రా?"

"మా బామ్మర్ది శీనుగాడి కూతురు" చెప్పాడు శ్యామలరావు.

"ఔను నాన్నా! చంద్రను పెళ్ళి చేసుకుంటాను. నా పెళ్ళి ఈ వూళ్ళోనే చెయ్యాలి" ముసిముసి నవ్వులు రువ్వుతూ అన్నాడు మనోహర్.

గురవయ్యకి వంటినిండా తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్లు, కారం పూసుకున్నట్లు మండుకొస్తోంది.

"ఇన్నాళ్ళకి మావాడు పెళ్ళికి ఒప్పుకున్నాడు" మురిపెంగా అన్నది అనసూయ శ్యామలరావు వైపు చూస్తూ.

గురవయ్యకి గంగ వెర్రులెక్కి పరిగెత్తుతుంటే "ఏమండీ, ఎక్కడికి? పెళ్ళి చూపులకెళ్దాం" అన్నది అనసూయ.

ఈ కబురు బామ్మర్దికి చెప్పడానికి పరిగెత్తాడు శ్యామలరావు.

రెండు కోట్లు కట్నం తీసుకోవాలనీ, హైదరాబాద్‌లో కొడుకు పెళ్ళికి స్పెషల్ బస్ వేసి తమ వూరి వారందరినీ తీసుకెళ్ళి తన మూడంతస్తుల మేడ చూపించాలనీ కలలు గన్న గురవయ్య కల తీరలేదు.

'అనుకున్నదొక్కటీ, అయిందొక్కటీ' అని పాడుకుంటూ జుట్టు పీక్కోవాలనుకున్నాడు.

కానీ గురవయ్యకి నెత్తిన జుట్టు లేదు. పాపం బట్టతల.

"సిరి వస్తుంటే మోకాలొడ్డాడట నీలాంటి మూర్ఖుడు. కోట్లు కట్నం ఇస్తామని తిరుగుతుంటే ఈ పల్లెటూరి పిల్ల నచ్చిందా?" అన్నాడు.

"సిరి ఇక్కడే వుంది నాన్నా!" అని నవ్వాడు మనోహర్.



## మరీ అంత ఇదా?

బిగ్ బ్రదర్ టీవీ రియాలిటీ షో పుణ్యమాని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో శిల్పాశెట్టి తెగ పోజు కొడుతోంది అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఇటీవల ఓ నిర్మాత తన సినిమాలో ఓ ఐటమ్ చేయండి మేడమ్ అని అడిగితే 50 లక్షలకి తక్కువ అయితే చెయ్యను అందిట శిల్ప. మరీ ఇంత పెద్ద అమౌంటా? అని నోరెళ్లబెట్టిన ఆ నిర్మాత ఆ పాటకి రాఖీని అడిగితే ఆమె రీజనబుల్ రేట్ చెప్పడం, ఓకే అవడం అయిందిట. శిల్పా శెట్టి మరీ ఇలా ఎక్కువ పోజు కొడితే వచ్చే ఆ చాన్సులు కూడా వస్తాయో రావో కదా గుసగుసలాడుకుంటున్నారు.